



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 105

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 30 ఆగష్టు 2025


# ఫుడ్ ప్రాసెసింగ్ కు ఏపీలో పుష్కలంగా అవకాశాలు

● వచ్చే ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడుల లక్ష్యం ● మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో పెట్టుబడి అవకాశాలు ● విశాఖలో ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు ● అమరావతిలో చాప్టర్ ఏర్పాటుపై ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటన



















**విశాఖపట్నం, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను ఈ రంగాల్లో సాధిస్తామని సీఎం పేర్కొన్నారు. శుక్రవారం విశాఖలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్ కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభదాయకంగా సుస్థిరంగా మార్చటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని సీఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఈ పరిశ్రమ విలువ ప్రస్తుతం 8 ట్రిలియన్ డాలర్లుగా ఉందని.. భారత్ కూడా 2030 నాటికి 700 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తోందని అన్నారు. ఈ రంగంలో భారత్ మరింత వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ లో ఏపీ 9 శాతం వాటాతో 50 బిలియన్ డాలర్ల విలువను కలిగి ఉందని అన్నారు. అలాగే జీఎస్డీపీలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల వాటా 35 శాతంతో రూ.5.19 లక్షల కోట్లుగా ఉందన్నారు. త్వరలోనే ఏపీ ఫ్రూట్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా అవతరిస్తుందని.. దేశంలోని ఉత్పత్తిలో 25 శాతం వాటాకు చేరుకుంటామని సీఎం తెలిపారు. అలాగే 2.26 లక్షల హెక్టార్లలో ఆక్వా కల్చర్ సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆక్వా హబ్ గా ఉందని

- 2లో



# విశాఖలో డబుల్ డెక్కర్ బస్సులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు

-డబుల్ డెక్కర్ బస్సులో పార్టీ నేతలతో కలిసి ప్రయాణించిన సీఎం.







**అమరావతి,కలంకౌంటర్ :** ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు తిరగనున్న పర్యాటక బస్సులు.. మొత్తం 16.కి.మీ. మేరకు తిరగనున్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు. రూ.500 టికెట్ ఛార్జీలో సగం మొత్తం ప్రభుత్వమే భరిస్తుంది.. ప్రపంచ పర్యాటకులకు ఆకర్షించేలా బీచ్?లను మారుస్తాం. విశాఖను రాజధాని చేస్తామని గతపాలకులు అంటే అవసరం లేదని తీర్పిచ్చారు.. ఆసియా టెక్నాలజీ హబ్?గా, రాష్ట్ర ఆర్థిక రాజధానిగా విశాఖ మారుతోంది. విశాఖలో త్వరలో డేటా సెంటర్, సీ కేబుల్ ఏర్పాటు చేస్తాం.. ఈ కేబుల్ ద్వారా విశాఖలో మిగతా ప్రపంచం అనుసంధానం అవుతుంది. మహిళలకు సురక్షితమైన నగరంగా విశాఖ ఎంపికైంది.. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నైతో విశాఖ పోటీపడుతోంది : సీఎం చంద్రబాబు

# విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి

● విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి ● ఒకే విభాగం పరిధిలోకి విద్యా శాఖ పరిధిలోని నిర్మాణాలు ● గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు ● ప్రతి విద్యా సంస్థలో క్రీడలకు ప్రాధాన్యం ● విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,కలంకౌంటర్ :** పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యతప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని... ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టుబడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని

- 2లో




# ఫుడ్ ప్రాసెసింగ్ కు ఏపీలో పుష్కలంగా అవకాశాలు






(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు.

**ఫుడ్ ప్రాసెసింగ్ లో అవకాశాలు- ప్రోత్సాహకాలు..**ఆంధ్రప్రదేశ్ లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే విస్తృతమైన మౌలిక సదుపాయాలు కూడా ఏపీ సొంతమని పెట్టుబడి దారులు, ఎగుమతిదారులకు వివరించారు. రాష్ట్రంలో 9 ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులు, 17 లక్షల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్, 33 లక్షల టన్నుల సరకు నిల్వ చేసేం దుకు గోదాములు ఉన్నాయని అన్నారు. ఫుడ్, బెవరేజ్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. చిత్తూరు, గుంటూరు, కోస్తాంధ్ర, విశాఖ జిల్లాల్లో పండ్లు, మసాలా దినుసులు, ఆక్వా, కోకో, కాఫీ క్లస్టర్లు ఉన్నాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, రూ.200 కోట్లకు పైగా పెట్టుబడులు దాటితే వాటిని మెగా ప్రాజెక్టులుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం వెల్లడించారు. గత ఏడాది రాష్ట్రానికి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు.

**ఆహారపు అలవాట్లు- మారుతున్న జీవన శైలితో పెట్టుబడులకు అవకాశాలు..** ప్రజల ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలితో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపారమైన అవకాశాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయం అని సీఎం పిలుపునిచ్చారు. ఈ రంగంలో వచ్చే ఎంఎస్ఎంఈలను కూడా ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని అన్నారు. వన్ ఫ్యామిలి -వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఫుడ్, బెవరేజెస్ రంగంలో కొత్త ఆవిష్కరణలను కూడా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇస్తామని అన్నారు. అలాగే అగ్రిటెక్ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి పని చేస్తున్నామని తెలిపారు. ట్రేసబిలిటి, సర్టిఫికేషన్, ప్యాకేజింగ్ లాంటి సవాళ్ల పై దృష్టి పెడుతున్నామని సీఎం తెలిపారు. మరోవైపు భారత్ లో తయారయ్యే ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో గ్లోబల్ బ్రాండ్స్ గా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందమైన విశాఖ ఇప్పుడు దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షితమైన నగరంగా ఖ్యాతి గడించిందన్నారు. త్వరలోనే సీ కేబుల్, డేటా సెంటర్లు కూడా విశాఖలో ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ సహా వ్యవసాయాధారిత పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులను ప్రోత్సహించేందుకు అమరావతిలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చాప్టర్ ఏర్పాటు కానుండటం సంతోషదాయకమని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీలో ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ పై చర్చలు..** ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్ మూడో ఎడిషన్ లో ఏపీలో విలువ జోడించిన ఆహార ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్ చేసిన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగింది. అలాగే ఆక్వా రంగంలో బ్రీడింగ్, నాణ్యమైన ఫీడ్, వ్యాధుల నియంత్రణ, ఎక్స్‌పోర్ట్ లింకేజిపై పారిశ్రామిక వేత్తలు, నిపుణులు, పరిశోధకులు చర్చించారు. పంట ఉత్పత్తి అనంతర నష్టాల నివారణ, స్మార్ట్ కోల్డ్ చెయిన్, లాజిస్టిక్స్ సదుపాయాలపై దృష్టి పెట్టే అంశంపైనా చర్చలు చోటు చేసుకున్నాయి. డైరీ, పౌల్ట్రీ, మాంసం ప్రాసెసింగ్ యూనిట్ల ఆటోమేషన్, ఎగుమతి ప్రమాణాలపై సదస్సులో చర్చించారు. ఈ సమావేశానికి ఏపీ మంత్రులు టీజీ భరత్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టీపీసీఐ చైర్మన్ మోహిత్ సింగ్లా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామిక ప్రతినిధులు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఎగుమతి దారులు, నిపుణులు హాజరయ్యారు.

## పెదప్రోలు రజక సంఘం ఆధ్వర్యంలో వినాయకుడి అన్నసమారాధన కార్యక్రమం...



**మోపిదేవి,కలంకౌంటర్:** మండల పరిధిలోని పెద్దప్రోలు గ్రామంలో అంకదేవర దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెదప్రోలు రజక సంఘం ఆధ్వర్యంలో అంకాల దేవర ఆలయం వద్ద వినాయకుడి విగ్రహం ఏర్పాటుచేసి గత మూడు రోజుల నుంచి పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం కల్లేపల్లి రా రామ్మోహన్ రావు మంగమ్మ దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు అనంతరం పెదప్రోలు గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 1200 మందికి పైగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమాన్ని మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ ప్రారంభించారు. తొలుత వినాయకుని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించగా అనంతరం రజక సంఘం వారు ఎస్సై సత్యనారాయణ ను శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెదప్రోలు రజక సంఘం నాయకులు, రజక యూత్ సభ్యులు కొండపల్లి రమేష్ , కల్లేపల్లి శ్రీనివాసరావు, కల్లేపల్లి రామ్మోహన్ రావు,కల్లేపల్లి వరప్రసాద్, కల్లేపల్లి సాయి రేగళ్ల బాలు, కొండపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన చైర్మన్ సుబ్బారావు



**మోపిదేవి,కలంకౌంటర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ కార్డుల పంపిణీ మోపిదేవి మండలంలో చురుకుగా సాగుతోంది. మోపిదేవి మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం స్మార్ట్ కార్డులను పిఎసిఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామ రెవెన్యూ అధికారి మోపిదేవి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం వేగంగా సాగుతోంది. మెరకనపల్లి గ్రామ పంచాయతీలోని మూడు రేషన్ షాపుల పరిధిలో మొత్తం 719 స్మార్ట్ కార్డులు వచ్చినట్లు వీఆర్వో వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి యన్నా వెంకట శ్రీనివాసరావు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది..



**విజయవాడ రూరల్,కలంకౌంటర్:** ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్నలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి టెంపుల్, ది మున్సిపల్ టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, గణేష్ సేవా సమితి వారి ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవములలో భాగముగా విజయవాడకు చెందిన ప్రఖ్యాత నాట్యాచార్యులు, శ్రీ లాస్య కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, కళా భూషణ్ డాక్టర్ దేవరకొండ చంద్రశేఖర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో తొలుత అంబా ప్రార్థన, మూషిక వాహన, కొండలలో నెలకొన్న, అదిగో అల్లదిగో, గరుడ గమన, పలుకే బంగార మాయేనా,ఇదిగో భద్రాద్రి, శ్రీమన్నారాయణ నృత్యాంశాలు నేత్రపర్వంగా సాగాయి. ఆట్రగడ చంద్ర తేజస్విని, వైకుంతం మోనిషా, మందడపు నాగ మనోజ్ఞ, యార్లగడ్డ భాను శ్రీ శరణి, కొట్టె సాధిక శ్రీ ప్రదర్శించిన కొలువై ఉన్నాడే, శ్రీ రాజగోపాల,రామాయణ శబ్దం, శివ పాద మంజీర నాదం, భో శంభో అంశాలు చక్కటి ఆంగికాభినయాలతో వీక్షకులను కనువిందు చేశారు. చిన్నారులు అనిష్క, మేఘాలిక, దీక్షిత,సాయి ఆశ్రిత, శాన్విక, మనస్వి, దిలీషా, శ్రీనిధి, వర్షిత, గ్రీష్మ, కుసుమాంజలి, సాయి నిత్యశ్రీ, శ్రావ్య, జాహ్నవి, అక్షర, జస్మిత, పునర్విక, జస్విత, భవ్య శ్రీ, ఉజ్వల నాగేశ్వరి, తన్విత, శిశిర, రుద్రప్రియ, శ్రావణ సంధ్య, తమ నృత్యాభినయంతో మైమరిపించారు. కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్ సొసైటి వ్యవస్థాపకులు మరియు కార్యదర్శి డాక్టర్ వేదాంతం వెంకట నాగ చలపతి (కెనడా), వారి సతీమణి డాక్టర్ వేదాంతం కిరణ్ (అధ్యక్షులు, కూచిపూడి హెరిటేజ్) పేరుమీద మరియు పరిమి విశ్వనాథ్ కుమార్ (సింగపూర్), వారి సతీమణి పరిమి శ్రీదేవి గారి పేరు మీద కళాకారులకు మొమెంటోలు మరియు సర్టిఫికెట్లు స్పాన్సర్ చేశారు. ఎందరినో నృత్య కళాకారులుగా తీర్చిదిద్ది, నృత్యం పట్ల ఎందరినో ఆకర్షితులు గావించి, నాట్యానికి వన్నెతెచ్చిన నాట్య గురువు డాక్టర్ దేవరకొండ చంద్రశేఖర్ ను శ్రీ వరసిద్ధి వినాయక స్వామి టెంపుల్ అసోసియేషన్ వారు దుశ్శాలువతో సత్కరించి, శిష్య బృందానికి సర్టిఫికెట్లు, మొమెంటోలు అందజేశారు.

## తెలుగు భాషా దినోత్సవం..



**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు..లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, లక్ష్మీపురం నందు తెలుగు భాషా దినోత్సవం.. ఈ సందర్భంగా వ్యవహారిక తెలుగు భాష కోసం కృషి చేసిన గిడుగు.వెంకట రామ్మూర్తి గారి చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.హరికృష్ణ పూల మాల వేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా గిడుగు.రామ్మూర్తి గారి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు..ఈ సందర్భంగా విద్యార్థులకు ఒక్క ఇంగ్లీష్ పదం రాకుండా తెలుగులో మాట్లాడటం పై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు..

## ఫలించిన చంద్రబాబు కృషి.... 738 కి.మీ ప్రయాణించి కుప్పానికి కృష్ణమ్మ

- 19 నియోజకవర్గాలను తాకుతూ....10 రిజర్వాయర్లను నింపుతూ శ్రీశైలం నుంచి నదీ జలాలు
- రాయలసీమను కోనసీమ చేసేలా రికార్డు టైంలో హంద్రీ-నీవా విస్తరణ పనులు
- శనివారం కుప్పం నియోజకవర్గంలో కృష్ణమ్మకు జల హారతి ఇవ్వనున్న సిఎం చంద్రబాబు



**అమరావతి, కలంకౌంటర్ :** రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు నాడు ఎన్టీఆర్ వివిధ ప్రాజెక్టులకు శ్రీకారం చుడితే...ఆయన కలను చంద్రబాబు సాకారం చేస్తున్నారు. సీమ పల్లెల్లోకి నీళ్లు పారించారు. సీమకు పూర్తి స్థాయిలో కృష్ణా జలాలు అనేవి ఇన్నేళ్లూ కల.. కానీ ఇప్పుడు అది నిజం. ఈ కలను చంద్రబాబు నిజం చేశారు. రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనేది మొదటి నుంచి తెలుగు దేశం పార్టీ సంకల్పం. సీమలో ప్రాజెక్టులు మొదలుపెట్టింది ఎన్టీఆర్ అయితే...వాటిని ముందుకు తీసుకువెళ్లి ఆ కలను నిజం చేసింది చంద్రబాబు నాయుడు. అతి తక్కువ వర్ష పాతం ఉండే సీమ జిల్లాల్లో నీళ్లతోనే సీమ ప్రజల స్థితిగతులు మారుతాయని ఇరిగేషన్ కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో హంద్రీ నీవాకు ఉమ్మడి రాష్ట్రంలో 1999 జులై 9 చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ రోజు బీడు భూముల్లో నీళ్లు పారేలా చేశారు. ఇదంతా రాత్రికి రాత్రి ఇది జరగలేదు. 2014 నుంచి నేటి వరకు ప్రభుత్వం భారీ ఎత్తున సాగునీటి ప్రాజెక్టులపై నిధుల ఖర్చు చేయడం వల్ల నేడు హంద్రీనీవా నీళ్లు చిత్తూరు జిల్లాలో చివరి ఆయకట్టు భూములకు చేరాయి.

**హెచ్ఎన్ఎస్ఎస్ కు నాడు అత్యంత ప్రాధాన్యం..** హంద్రీనీవా ప్రాజెక్టుపై 2014-19 మధ్య రూ.4,183 కోట్లు ఖర్చు పెట్టి చంద్రబాబు ప్రాజెక్టును పరుగులు పెట్టించారు. 2019లో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టించింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సీజన్‌లో ఎలాగైనా నీళ్లు ఇవ్వాలని లక్ష్యంతో పనుల్లో వేగం పెంచారు. రికార్డు స్థాయిలో కేవలం 100 రోజుల్లో మెయిన్ కెనాల్ విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేసి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పెంచారు.

**సాగు బాగుంటేనే... రాష్ట్రం బాగుంటుంది..** సాగు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ చెబుతారు. చెప్పడమే కాదు.. దాన్ని చేసి చూపించాలన్న సంకల్పంతోనే రికార్డు స్థాయిలో చేపట్టిన హంద్రీ-నీవా కాల్వ విస్తరణ పనులతో సీమకు జలకళ వచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతోంది. విస్తరించిన కాల్వల ద్వారా పరుగులు పెడుతున్న కృష్ణమ్మ 19 నియోజకవర్గాలను తాకింది. 10 రిజర్వాయర్‌లను నింపుతోంది. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ, అనంతపురం జిల్లాలో జీడిపల్లి, పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లు నిండాయి. సత్యసాయి జిల్లాలో మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి... అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసాపురం, అడవిపల్లి రిజర్వాయర్లు నిండుతున్నాయి. అలాగే గాజుల దిన్నెకు నీరు చేరింది.

**చిత్తూరు సస్యశ్యామలం..** హంద్రీనీవా ఆయకట్టులో చిట్ట చివరి జిల్లా చిత్తూరు. చిత్తూరు జిల్లాలో 16 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నా... కేవలం 6 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోంది. మిగిలిన 10 లక్షల ఎకరాలకు సాగునీరిస్తే...రైతన్నకు నీటి కొరతే ఉండదు. హంద్రీనీవా రెండో దశ పనులు పూర్తి చేసి జిల్లాలోని 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు ప్రభుత్వం ఇవ్వనుంది. చిత్తూరు జిల్లాలో సాగు అంతా బోర్లపైనే ఆధారపడి ఉంది. 565 కి.మీ. మేర ఉన్న పుంగనూరు, నీవా, తంబళ్లపల్లి, కుప్పం, చింతపర్తి, ఎల్లుట్ల, వాయల్పాడు, సదుం బ్రాంచ్ కాలువలతో 1,86,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు దీంతో ప్రయోజనం కలుగుతుంది.

**పరమ సముద్రానికి కృష్ణా జలాలు..** గత నెల 17వ తేదీన కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేశారు. నాటి నుంచి హంద్రీనీవా కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మ 738 కి.మీ ప్రయాణించి కుప్పానికి చేరింది. పరమ సముద్రంలో సిఎం చంద్రబాబు కృష్ణా జలాలకు హారతి ఇవ్వనున్నారు. తరలి వచ్చిన కృష్ణమ్మ కుప్పం నియోజకవర్గంలో ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. జల హారతి కార్యక్రమం కోసం కుప్పం వెళుతున్న సిఎం వారి సంతోషాన్ని పంచుకోనున్నారు.

**కుప్పం బ్రాంచ్ కెనాల్..** 215 క్యూసెక్కుల సామర్థ్యంతో 123 కి.మీ. పొడవున కుప్పం బ్రాంచ్ కెనాల్ నిర్మించారు. రూ. 197 కోట్లతో కాలువ లైనింగ్ పనులు పూర్తి చేశారు. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో ఈ కాలువ వెళ్తుంది. ఈ కాలువ ద్వారా 4 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వడమే కాకుండా... 110 చెరువులు నింపడం ద్వారా 6,300 ఎకరాల స్థిరీకరణ జరుగుతుంది. ప్రభుత్వ చిత్తశుద్ధి సంకల్పంతో 40 టిఎంసిల నీటిని ఒక్క హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయల సీమ జిల్లాలు వినియోగించుకోనున్నాయి. చెరువుల అన్నినింపే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. దీంతో సీమలో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ఉద్యాన పంటల ఉత్పత్తులు పెంచేందుకు సాగునీటి సౌకర్యం ఎంతో దోహదం చేయనుంది. ఈ ప్రాంత రైతులు, ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరగనున్నాయి.

## విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి

- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేములు శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## మోపిదేవి మండల తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఎం హరనాథ్



**మోపిదేవి,కలంకౌంటర్ :** మచిలీపట్నం కలెక్టరేట్ నుండి మోపిదేవి మండల తహసీల్దారుగా నియమితులైన ఎం హరనాథ్ గురువారం సాయంత్రం బాధ్యతలను చేపట్టారు. మండల తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన హరనాథ్ ను మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ హరనాథ్ స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనను ఎవరైనా, ఎప్పుడైనా స్వయంగా కలిసి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చని అన్నారు.

## ఘనంగా పడుచూరి వెంకటేశ్వర్లు దంపతుల పెళ్లిరోజు వేడుకలు

**కడప,కలంకౌంటర్ :** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర పొలిటికల్ విభాగం వైస్ చైర్మన్ పడుచూరి వెంకటేశ్వర్లు దంపతులు పెళ్లి రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో దరిశా శ్రీనివాసులు, ఆకుల రాజశేఖర్, దేవతి శంకరయ్య, లేపూరి మహేష్, పూజారి సురేష్ స్వామి, రాఘవ స్వామి, మెడాజనార్ధన్, మాడి శెట్టి నారాయణ,గుడుగుంట్ల లక్ష్మయ్య, మెంటా ప్రసాద్, మురళి, నిచ్చెనమెట్ల సుదర్శన్, రఘుశ్రవణ్,గాధం శెట్టినరసింహులు, మేడా సుమన్ సుంకు నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# గతప్రభుత్వ కాంట్రాక్టర్ల అవినీతి పై విజిలెన్స్ ఎంక్వరీ..



**కందుకూరు,కలంకౌంటర్:** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన నెల్లూరు జిల్లా అభివృద్ధి సమావేశంలో పాల్గొన్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు. సమావేశం అనంతరం మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ మరియు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి లతో కలిసి పత్రిక సమావేశంలో మాట్లాడిన ఇంటూరి. గత ప్రభుత్వ హయాంలో అవినీతి పై విజిలెన్స్ ఎంక్వరీ వేయాలని మంత్రి నారాయణ ను కోరిన కందుకూరు ఎమ్మెల్యే.. ఎంజిబి లేఅవుట్ తోపాటు మరికొన్ని పనులలో భారీ అవినీతి జరిగిందంటూ ఆధారాలు చూపుతూ కీలక వ్యాఖ్యలు...

# ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్



**కందుకూరు, కలంకౌంటర్:** పట్టణంలో శుక్రవారం నూతనంగా వెల్డింగ్ డిజైన్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు తదుపరి సెప్టెంబర్ 2వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు ఇస్లాంపేట పాడీఖానా లో జరిగే యూనియన్ ఫంక్షన్ కి ఎమ్మెల్యే ని ఆహ్వానించారు. కావున ఈ వేడుకకు వెల్డింగ్ డిజైన్ వర్కర్స్ అందరూ పాల్గొనవలసిందిగా యూనియన్ తరఫున కోరారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**బంటుమిల్లి,కలంకౌంటర్:** బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషాదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి . కళాశాల సెమినార్ హాల్లో జరిగిన ఈ తెలుగు భాషా దినోత్సవవేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్ .జగన్ మోహన రావు సభకు అధ్యక్షత వహించారు. తొలుత తెలుగు భాష కు విశేష సేవలు అందించిన గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్ రావు మరియు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్రావు మాట్లాడుతూ ,తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన విశేషమైనటువంటి సేవను కొని ఆడారు, విద్యార్థుల్లో తెలుగు భాష పట్ల మక్కువ పెంచుకుని, తెలుగు భాషామ తల్లి ఋణం తీర్చుకోవాలని ప్రిన్సిపాల్ జగన్మోహన రావు విద్యార్థులకు సూచించారు. తెలుగు శాఖ సారథ్యంలో ఈ తెలుగు భాషా దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి .తెలుగు శాఖాధిపతి ఆచార్య డాక్టర్. జి.బి .ఆనందకుమార్ తెలుగు భాషకు సంబంధించిన మాధుర్యతను వర్ణిస్తూ, తెలుగు భాషకు విశేషమైన సేవలు అందించిన విదేశీయులైన సిపి బ్రౌన్, కృష్ణదేవరాయలు మొదలైనటువంటి వారి యొక్క సాహితీ సేవను వేనోళ్ల కొనియాడారు. అంతేకాక ప్రమాదపు అంచున తెలుగు భాష ఉందని తెలియజేస్తూ తెలుగు భాషను బ్రతికించుకోవాల్సిన అవసరం విద్యార్థుల పై ఉందని తెలియజేస్తూ తెలుగు భాషా మాధుర్యాన్ని తనదైన శైలిలో వినిపించారు. ఈ భాషా దినోత్సవ వేడుకల్లో జరిగిన వివిధ అంశాలకు జరిగిన పోటీలో విజేతలకు బహుమతి ప్రధానం జరిగింది అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ భాషా దినోత్సవ వేడుకలకు ఆంగ్ల శాఖ అధిపతి బి దేవ జయరాజు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఆర్. హిమాలినీదేవి,కంప్యూటర్స్ శాఖ అధిపతి డాక్టర్ కె. సత్య రాజేష్ , రామారావు, చలం, జ్యోత్స్న ,రత్న , అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘన నివాళులర్పించారు.

# కొమ్మారెడ్డి , సెయింట్ జాన్స్ పాఠశాలల్లో ఘనంగా " తెలుగు భాషా దినోత్సవం"



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** గిడుగు వెంకట రామమూర్తి గారి జయంతిని పురస్కరించుకుని బంటుమిల్లి పట్టణంలోని సెయింట్ జాన్స్ కొమ్మారెడ్డి పాఠశాలల్లో శుక్రవారం " తెలుగు భాషా దినోత్సవం" ఘనంగా నిర్వహించారు.. ఆయా పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలోపాఠశాల డైరెక్టరులు కొమ్మారెడ్డి కిషోర్, సాబుజాన్ మరియు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పలువురు గిడుగు వెంకట రామమూర్తి గారి చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా తెలుగు కవులు, కవయిత్రుల వేషధారణలతో విద్యార్థినులు అందరిని అలరించారు. చిన్నారులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సాంప్రదాయ వస్త్రాలు ధరించి అందరిని ఆకట్టుకున్నారు. ఆయా పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమాలలో పాఠశాల డైరెక్టర్లు కొమ్మారెడ్డి కిషోర్ , సాబుజాన్ లు మాట్లాడుతూ మాతృభాషను,మాతృభూమిని మరువకూడదని మాతృభాష పై పట్టు సాధిస్తే మిగిలిన భాషలను సులువుగా నేర్చుకోవచ్చని విద్యార్థులకు ఉద్బోధించారు., ఈ కార్యక్రమాలలో ఆయా పాఠశాలలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# చార్టర్డ్ అకౌంటెంట్లకు రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపు






**విశాఖపట్నం,కలంకౌంటర్ :** దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎపి లోని కూటమి ప్రభుత్వం నాలెడ్జ్ బేస్డ్ ఎకానమీని నిర్మిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను 2047నాటికి 2.4ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నది మా లక్ష్యం. ఈ ప్రయాణంలో చార్టర్డ్ అకౌంటెంట్లు కంట్రిబ్యూటర్లుగా మాత్రమే కాకుండా మార్గదర్శకులుగా నిలవాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఐసిఎఐ ఆధ్వర్యాన అర్థసమృద్ధి %-% 2025 పేరిట వైజాగ్ కన్వెన్షన్స్ లో జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ప్రతి పారిశ్రామిక విప్లవానికి రెండు పార్శ్వాలు ఉంటాయి, ప్రతి పారిశ్రామిక విప్లవం కొత్త అవకాశాలను సృష్టిస్తుంది, గతంలో ఐటి విప్లవం వచ్చినపుడు భారతదేశం అత్యధికంగా లబ్ధిపొందింది, అదేతరహాలో ప్రస్తుతం ఎఐ విప్లవంతో లబ్ధిపొందబోతున్నాం. రాజకీయ పార్టీగా మేం డిజిటల్ లైబ్రరీ, విశ్లేషణాత్మక సమాచారం కోసం ఎఐ వినియోగిస్తున్నాం, అసెంబ్లీలో అర్థవంతమైన చర్చల కోసం ఎఐ టూల్ ను ఉపయోగిస్తాం. ఎఐ ఆధారిత గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం.

**ఈజ్ ఆఫ్ లివింగ్ కు ప్రాధాన్యతనిస్తున్నాం..** ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నాం. రాయలసీమలోని అనంతపురంలో ఆటోమోటివ్, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, ప్రకాశం జిల్లాలో సిబిజి, గుంటూరు కృష్ణా జిల్లాలో క్వాంటమ్ వ్యాలీ, గోదావరి జిల్లాల్లో ఆక్వా, ఉత్తరాంధ్రలో ఐటి, ఫార్మా, లాజిస్టిక్స్ పరిశ్రమలకు ప్రాధాన్యత నిస్తున్నాం. CA లు (చార్టర్డ్ అకౌంటెంట్స్) నైతికతతో మెరుగైన పాలసీలను అమలు చేయడంలో మాకు సహాయం అందించాలి. పాలసీలను సరైన దిశలో నడిపించడంలో, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో ముఖ్యమైన పాత్ర పోషించాలి. సిఎలు ఆంధ్ర ప్రదేశ్ బ్రాండ్ అంబాసడర్?గా నిలవాలి. టారిఫ్ వార్ కారణంగా భారత్ నష్టపోకుండా కొత్త మార్కెట్లను అన్వేషించాలి. ఈజ్ ఆఫ్ లివింగ్ కు ప్రాధాన్యతనిస్తూ మనమిత్ర ద్వారా 700రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. పరిపాలన వ్యవహారాల్లో ఎఐ వినియోగానికి సంబంధించి టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ తో ఒప్పందం చేసుకున్నాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మేం ఏర్పాటుచేసిన వర్కింగ్ గ్రూపులో చేరి మీవంతు సూచనలు, సలహాలు అందించండి.

**భోగాపురం ఎయిర్ పోర్టుతో అనూహ్య అభివృద్ధి..** ఎపిలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల వల్ల గూగుల్, టిసిఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రఖ్యాత సంస్థలు విశాఖకు రాబోతున్నాయి. ఐసిఎఐ అంటే కేవలం బ్యాలెన్స్ షీట్లు సరిచూసే సంస్థ మాత్రమే కాదు, సమసమాజాన్ని నిర్మించే ఒక వేదిక. సిఎలు అంటే కేవలం ఖాతాపుస్తకాలను చూసే ఆడిటర్లు మాత్రమే కాదు, బాధ్యత, జవాబుదారీతనానికి ప్రతిరూపం. బలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సిఎలది కీలకపాత్ర. మరో ఏడాదిలో భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తవుతుంది, ఆ తర్వాత ఉత్తరాంధ్ర స్వరూపం మారబోతోంది. దీనివల్ల, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు అనూహ్యంగా అభివృద్ధి చెందుతాయి. ప్రస్తుత శాసనసభలో 50శాతం మంది కొత్తవారు, మంత్రివర్గంలో కూడా 17మంది కొత్తవారే. ఆంధ్రప్రదేశ్ ను నెం.1గా తీర్చిదిద్దేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రాభివృద్ధిలో సిఎలు ప్రముఖ పాత్ర పోషించాలి. విశాఖపట్నంలో అకౌంటింగ్, ఆడిటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటు చేసేందుకు ఐసిఎఐ చొరవచూపాలి.

**సిటీ ఆఫ్ డెస్టినీ మాత్రమే కాదు...** మీరు కేవలం రికార్డు కీపర్లు మాత్రమే కాదు... భారతదేశ నిర్మాణ రూపశిల్పులు. విశ్వసనీయమైన గణాంకాలు ఉన్న దేశం అన్నివిధాల అభివృద్ధి సాధిస్తుంది. ఆ విశ్వాసానికి ప్రతిరూపం ఆడిటర్లు. ఈ సమావేశాన్ని సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖపట్నంలో జరపడం సముచితమైన నిర్ణయం. ఆంధ్రప్రదేశ్ కు డీప్ వాటర్ పోర్టు, ఐటి, ఫార్మా, మెడిటెక్ పరిశ్రమలు మణిహారం లాంటివి. చంద్రబాబుగారి విజన్ ప్రకారం విశాఖపట్నం అభివృద్ధి చెందితే యావత్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధిస్తుంది. నేడు విశాఖపట్నం సిటీ ఆఫ్ డెస్టినీ మాత్రమే కాదు... ప్రపంచస్థాయి ఫైనాన్స్, ఇన్నొవేషన్, టెక్నాలజీకి కేంద్రబిందువుగా రూపుదిద్దుకుంటోంది. ఐసిఎఐ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ విశాఖపట్నం వారు కావడం ఆంధ్రప్రదేశ్ లోని సిఎలకు గర్వకారణం. క్రమశిక్షణతో కూడిన ఉత్తమ నాయకత్వానికి ఎల్లలు ఉండవనడానికి ఆయన సాధించిన విజయమే నిదర్శనం.

**సంపదసృష్టి మార్గాలను అన్వేషించండి..** ఈరోజు దేశం మీ నుంచి ఆశిస్తున్నది కేవలం కంప్లయెన్స్ నివేదికలు మాత్రమే కాదు. ఎఐ ఆధారిత ఆడిట్లు, బ్లాక్ చెయిన్ ట్రాన్సపరెన్సీ, ఎన్విరాన్ మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్ ఆధారిత సుస్థిర నివేదికలు, ప్రపంచ పెట్టుబడులు, రిస్క్ మేనేజ్ మెంట్, స్టార్టప్ లు, ఎంఎస్ఎంఇలకు మార్గదర్శకత్వం వహించడం వంటి అంశాలపై దృష్టిసారించండి. సంపదను పరిరక్షించడమే కాదు... దానిని సృష్టించే మార్గాలను అన్వేషించండి. కంప్లయన్స్ ను నిర్ధారించడమే కాకుండా పోటీతత్వాన్ని మరింత పెంచండి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పారదర్శకత, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో ముందుకు సాగుతోంది. ఐటి, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తోంది. రాష్ట్రాభివృద్ధికి మీ వంతు సహాయ, సహకారాలు అందించాల్సిందిగా మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. గూగుల్ వంటి ప్రపంచ ప్రఖ్యాతి సంస్థ విశాఖలో డాటా సెంటర్ ఏర్పాటు చేయబోతుందంటే అందుకు కారణం ప్రధాని మోడీ జీ, చంద్రబాబు గారు తెచ్చిన సంస్కరణల వల్లే. 2019 ఎన్నికల్లో కష్టకాలంలో కూడా మమ్మల్ని విశాఖ ప్రజలు ఆదరించి నలుగురు శాసనసభ్యులను గెలిపించారు. రాబోయే నాలుగేళ్లలో విశాఖనగరం రూపురేఖలు మార్చేసి మీ రుణం తీర్చుకుంటామని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఐసిఎఐ ఉపాధ్యక్షులు ప్రసన్నకుమార్, సదరన్ రీజియన్ వైస్ చైర్మన్ ముప్పాళ్ళ సుబ్బారావు, ఐసిఎఐ విశాఖ బ్రాంచి ప్రతినిధులు అందవరపు శ్రీధర్, రామానాయుడు, పట్నాల లోకేష్, ఉజ్వల, లీలా వరప్రసాద్, గురుమూర్తి, రాంబాబు, సభ్యులు, వృత్తి నిపుణులు పాల్గొన్నారు.

# అవగాహన కల్పించడంతోనే సైబరు నేరాలను నియంత్రించవచ్చు - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్








**విజయనగరం,కలంకౌంటర్:** వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ బొబ్బిలి పోలీసు స్టేషన్ సందర్శించి, స్టేషను ప్రాంగణాన్ని, పోలీసు బిల్డింగ్ లోని గదులను, ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీలించారు. పోలీసు స్టేషను ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న వాహనాలను పరిశీలించి, ఆయా వాహనాలు ఏ కేసులో సీజ్ చేసారన్న విషయాలను అధికారులను అడిగి తెలుసుకొని, చట్ట ప్రకారం సీజ్ చేసిన వాహనాలను డిస్పోజ్ చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. వార్షిక తనిఖీకి బొబ్బిలి విచ్చేసిన జిల్లా ఎస్పీకి డిఎస్పీ జి.భవ్య రెడ్డి పూల మొక్కను అందించి స్వాగతం పలకగా, పోలీసుల నుండి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ – సైబరు నేరాలను నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడమే ప్రధానమని, అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సైబరు నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషను పరిధిలో నమోదవుతున్న కేసుల తీరును జిల్లా ఎస్పీ పరిశీలించి, ఆయా కేసులను సమీక్షించారు. నేరాల నియంత్రణ, కేసుల మిస్టరీ ఛేదనలో సిసి కెమెరాలు చాలా ముఖ్య భూమికను పోషిస్తున్నాయన్నారు. నేర నియంత్రణలో భాగంగా పోలీసు స్టేషను పరిధిలో సాధ్యమైనన్ని ఎక్కువ సిసి కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సందర్శనలు తరుచూ చేయాలని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాల్లో పల్లెనిద్ర చేపట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను గుర్తించి, వాటిని నియంత్రించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడా జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని, పేకాటలు, కోడిపందాలను నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. అనంతరం, జిల్లా ఎస్పీ రిసెప్షను రిజిస్టరును పరిశీలించి, ఫిర్యాదులను ఏవిధంగా రిజిస్టరులో నమోదు చేస్తున్నది, డిస్పోజ్ చేస్తున్నది పరిశీలించారు. జనరల్ డైరీ, సెంట్రీ బుక్కు, బీటు బుక్కులు, డ్యూటీ రోస్టరు, విలేజ్ రోస్టరు, కేడి చెక్ రిజిస్టరు, క్రైం అబ్ స్ట్రాక్ట్, క్రైం చార్టు, సిడి ఫైల్స్ను తనిఖీ చేసారు. దర్యాప్తులో ఉన్నకేసుల సిడి ఫైల్స్ ను పరిశీలించి, దర్యాప్తు జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తునువేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులపై నిఘా పెట్టాలని, వారంలో ఒకరోజున వారిని స్టేషనుకు పిలిపించి, కౌన్సిలింగు చేయాలన్నారు. పోలీసు స్టేషను నూతనంగా ఇచ్చిన కంప్యూటర్సును జిల్లా ఎస్పీ పరిశీలించి, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. నేరాలను నియంత్రించేందు ఈ పహారాతో కట్టుదిట్టమైన చర్యలు చేయాలన్నారు. పోలీసు సిబ్బంది దత్తత గ్రామాలు తరుచూ సందర్శించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. అనంతరం, గంజాయి నియంత్రణకు పాత బొబ్బిలి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును సందర్శించి, అక్కడ సిబ్బంది వాహన తనిఖీలు చేపడుతున్న తీరును జిల్లా ఎస్పీ పరిశీలించి, రికార్డులు తనిఖీ చేసారు. గంజాయి నియంత్రణకు నిరంతరం వాహన తనిఖీలు చేపట్టాలని, ఒడిస్సా నుండి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అదే రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద నియంత్రణ చర్యలు చేపట్టాలని, కాషనరీ బోర్డులు, లైటింగు, రేడియం స్టిక్కర్లును అతికించాలని అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ గారు స్టేషను సందర్శించిన సమయంలో బొబ్బిలి డిఎస్పీ జి. భవ్యరెడ్డి, బొబ్బిలి సిఐ సతీష్ కుమార్, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, బొబ్బిలి రూరల్ సిఐ కే.నారాయణరావు, బొబ్బిలి ఎస్ఐలు జ్ఞాన ప్రసాద్, రమేష్, పోలీసు అధికారులు, సిబ్బంది హాజరుగా ఉన్నారు.

# మన కందుకూరు వారికి నేషనల్ సర్వీస్ రత్న అవార్డు 2025





**కందుకూరు, కలంకౌంటర్:** పారాచూట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ వారు మధర్ థెరిస్సా జయంతి సందర్భంగా పలు రాష్ట్రాలలో నిస్వార్థంగా సమాజానికి సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సేవకులను గుర్తించి వారిని నేషనల్ సర్వీస్ రత్న అవార్డు 2025 కి ఎంపిక చేసి వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్నారు. శుక్రవారం కందుకూరు పట్టణానికి చెందిన శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీలో యాక్టీవ్ గా సేవలను అందిస్తున్న సభ్యులు కోట వెంకటేశ్వర్లు,గుర్రం చిన్న అల్లూరయ్య, ఇన్నమూరి శ్రీనివాసులు,గోనుగుంట వేణుగోపాలరావు ను ఈ అవార్డుకు ఎంపిక చేసి వారికి ప్రశంసాపత్రాలు పంపించారు. ఈ రోజు సొసైటీ అధ్యక్షులు సేవారత్న రవ్వా శ్రీనివాసులు (ఎల్ ఐ సి ఏజెంట్), సెక్రటరీ పబ్బిశెట్టి వెంకట సురేష్ (జే.ఎమ్. షేర్స్ ఆఫీసు) వారిని సన్మానించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ద్వారా చేస్తున్న వివిధ రకాల సేవలను గుర్తించి మమ్మల్ని ఎంపిక చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రావడం సమాజం పట్ల మరింత ఎక్కువ బాధ్యత పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా కొంతమంది ప్రముఖులు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

# 158 ఉద్యోగాలకు ఎంపిక: ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రవికుమార్





**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సాకారంతో కందుకూరు టి ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల నందు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్ మేళాలో 268 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. 158 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో 53 మంది కళాశాల విద్యార్థులు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం అని అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అభివృద్ధి సంస్థ డిప్యూటీ ఆఫీసర్ ఓ జనార్ధన్, సిహెచ్ శ్రీనివాసరావు, కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రాజగోపాల్, పోలీస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండల నరేంద్ర, డాక్టర్ కే సుజాత డాక్టర్ ఎంవి శ్రీహరి డాక్టర్ ఎం తిరుమల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వపరంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

● ఎనర్జీ, టాలెంట్, డిటర్మినేషన్ మన ఆంధ్ర రాష్ట్ర యువకుల బ్లడ్ లోనే ఉంది ● క్రీడల కోసం ప్రపంచస్థాయి మౌలిక వసతులను కల్పిస్తాం ● విద్యాశాఖ నుంచి ఎలాంటి మద్దతు కావాలన్నా అందజేస్తాం ● విశాఖ ఏయూ కన్వెన్షన్ హాల్ లో జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్ ● క్రీడాకారులను ఘనంగా సత్కరించిన మంత్రి







**విశాఖపట్నం,కలంకౌంటర్ :** ఎనర్జీ, టాలెంట్, డిటర్మినేషన్ మన ఆంధ్ర రాష్ట్ర యువకుల బ్లడ్ లోనే ఉందని, ప్రభుత్వ పరంగా క్రీడాకారులను పోత్సహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భారత హాకీ లెజెండ్, మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని శాప్ ఆధ్వర్యంలో విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మేజర్ ధ్యాన్ చంద్, తెలుగు భాషా వికాసానికి కృషిచేసిన గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... కేబినెట్ మీటింగ్ లో స్పోర్ట్స్ గురించి చాలా చర్చించాం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పోర్ట్స్ ను ప్రమోట్ చేయాలని, గ్రాస్ రూట్ మూమెంటమ్ క్రియేట్ చేయాలన్నారు. ఇప్పుడున్న పిల్లలు యూట్యూబ్, పబ్జీలకు అలవాటుపడ్డారు. వీటికి ఫుల్ స్టాప్ పెట్టాలంటే గ్రాస్ రూట్ మూమెంటమ్ క్రియేట్ చేస్తేనే సమాజంలో మార్పు వస్తుందని మేమందరం చర్చించాం, నమ్మాం. చంద్రబాబు నేతృత్వంలో ఒక గ్రాస్ రూట్ మూమెంటమ్ క్రియేట్ చేశారు. ఇది ప్రారంభం మాత్రమే. 24వేల మంది యువకులు దాదాపు పది క్రీడల్లో పాల్గొని జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సుమారు 462 మంది విన్నర్స్ మనముందు ఉన్నారు. మిమ్మల్నందరినీ చూస్తే నాకు ఒకటి గుర్తుకువస్తుంది. ఎనర్జీ, టాలెంట్, డిటర్మినేషన్ మన ఆంధ్ర రాష్ట్ర యువకుల బ్లడ్ లోనే ఉంది. ఈ రోజు వేదికపైన కూర్చొన్న వారిని గమనిస్తే ఈ స్థాయికి రావడం వెనుక చాలా త్యాగం ఉంది. హంపీ తాను ఎదుర్కొన్న కష్టాల గురించి మాట్లాడారు. క్రీడల్లో తమ పిల్లలను తల్లిదండ్రులు కూడా ఎంకరేజ్ చేయని పరిస్థితి. పట్టుదల, కమిట్ మెంట్ ఉంటే రాబోయే రోజుల్లో మీరు కూడా ఈ వేదికపై కూర్చొనే అవకాశం కలుగుతుంది.

**ప్రభుత్వపరంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తాం..** ప్రభుత్వపరంగా క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తాం. దేశానికే కాదు.. ప్రపంచానికే ఏపీని క్రీడా రాజధానిగా మార్చాలనేది మా లక్ష్యం. మొదట విద్యావ్యవస్థలోనే మార్పు తీసుకువస్తాం. అందుకే ప్రతి శనివారం నో బ్యాగ్ డే ప్రకటించాం. లైఫ్ స్కిల్స్, స్పోర్ట్స్ ను ప్రోత్సహిస్తాం. తొలి అడుగు మాత్రమే వేశాం. అన్నీ సాధించామని చెప్పడం లేదు. చేయాల్సింది చాలా ఉంది. ఇది కేవలం ప్రభుత్వం వల్ల మాత్రమే సాధ్యం కాదు. ప్రైవేటు సంస్థలు కలిసికట్టుగా రావాలి. మనం జేఎస్ డబ్ల్యూ, జీఎంఆర్ వంటి సంస్థలను చూశాం. అద్భుతంగా ఫండింగ్ చేస్తున్నారు. వాళ్లందరినీ ఒక ఫ్లాట్ ఫాం పైకి తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఒక గ్రాస్ రూట్ మూమెంటమ్ క్రియేట్ చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యం.


**క్రీడల కోసం ప్రపంచస్థాయి మౌలిక వసతులను కల్పిస్తాం..** క్రీడల కోసం ప్రపంచస్థాయి మౌలిక వసతులను కల్పిస్తాం. మిమ్మల్నందరినీ ప్రమోట్ చేస్తాం. ఇది కేవలం మెడల్స్ కోసం మాత్రమే కాదు. ప్రజల ఆరోగ్యం కోసం కూడా. మంగళగిరిలో 45 పార్క్ లను నిర్మిస్తున్నాం. దీనివల్ల సోషల్ ఇంటిగ్రేషన్ కూడా ఏర్పడుతుంది. సింగపూర్ లో సోషల్ హార్మోనీ క్రియేట్ చేసేందుకు అందరూ కలిసికట్టుగా ప్రయత్నిస్తారు. ఇది చాలా అవసరం. అందరికీ అద్భుత అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వేదికపై ఉన్న ప్రముఖ క్రీడాకారులకు నేను అభిమానిని. వారు సాధించిన విజయాలు, పోరాడిన తీరు చూసి చాలా గర్వపడతా. తెలుగువారు ఒకరు ఉన్నారని గర్వంగా నేను ఫీల్ అవుతా. క్రీడాకారులకు నేను వ్యక్తిగతంగా చాలా మద్దతుగా ఉంటా.

**సాధించాలనే పట్టుదల, కసి ఉండాలి..** మనలో పట్టుదల, కసి ఉండాలి. అప్పుడే సాధించగలగుతాం. జీవితంలో సక్సెస్ అంత సులభంగా రాదు. అనేక కష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటన్నింటిని తట్టుకుని నిలబడాలి. మనల్ని అవమానించిన వారికి గుణపాఠం చెప్పాలనే కసి ఉండాలి. చంద్రబాబు గారు, మోదీ గారి జీవిత ప్రయాణం చూస్తే.. విజయాలు మాత్రమే కనిపిస్తాయి. దాని వెనుక అనేక వైఫల్యాలు కూడా ఉంటాయి. ఫెయిల్యూర్స్ ఎప్పుడూ వారిన ఆపలేదు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుని అహర్నిశలు కష్టపడ్డారు. విద్యాశాఖ వద్దని నాకు చాలా మంది చెప్పారు. నేను కష్టమైన మార్గాన్నే ఎంచుకుంటాను. సవాళ్లను స్వీకరించాలి. జిల్లా, రాష్ట్రం, దేశం గర్వపడే విధంగా చేయాలి. కేంద్రం కూడా మద్దతుగా నిలుస్తోంది. ఇటీవల యోగాంధ్ర కూడా నిర్వహించుకున్నాం.

**విద్యాశాఖ నుంచి ఎలాంటి మద్దతు కావాలన్నా అందజేస్తాం..** విద్యాశాఖ నుంచి ఎలాంటి మద్దతు కావాలన్నా ఇస్తాం. క్రీడల్లో బాగా రాణించాలి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన పాలసీలో క్రీడాకారులు సాధించిన విజయాల పట్ల ప్రభుత్వం ఇవ్వాల్సిన నగదు బహుమతులు, రిజర్వేషన్లలో తగిన ప్రాధాన్యత కల్పించే బాధ్యత మేం తీసుకుంటాం. ఇది కేవలం మెడల్స్ గురించే కాదు.. నేను దేవాన్ష్ ను చూస్తా. మేం ఉదయం లేపకుండానే తనంతట తానే క్రమశిక్షణతో 6 గం.లకు లేచి చెస్ ఆడతారు. ఇక్కడున్న ప్రముఖ క్రీడాకారులు తమ విలువైన సూచనలు ఇవ్వాలి. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. డయాబెటిస్ వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడున్న వారు రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలన్నారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖ క్రీడాకారులు పి.గోపీచంద్, ఎంఎస్ కే ప్రసాద్, కోనేరు హంపీని మంత్రి లోకేష్ ఘనంగా సత్కరించారు. వివిధ క్రీడల్లో రాణించిన సాకేత్ సాయి మైనేని, యర్రాజి జ్యోతి, ఈ.రజిని, డి.జ్యోతికశ్రీ, షేక్ జెఫ్రిన్, పి.శివారెడ్డి, శ్రీమతి సత్యగీతతో పాటు పలువురు క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ శ్రీభరత్, మంత్రులు వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయ స్వామి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ పీఎస్ గిరీషా, ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు తదితరులు పాల్గొన్నారు.

# జన్మదిన శుభాకాంక్షలు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రముఖ వస్త్ర వ్యాపారి సామాస్ శ్యామ్ జన్మదినోత్సవం సందర్భంగా షోరూమ్ లో మిత్ర బృందం ఆద్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో సామా ప్రదీప్,సామా కిషోర్ , సామా కిరణ్,యండూరి సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలు ఆర్థికంగా బలోపేతం కావడం లక్ష్యం











**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆడబిడ్డలను ఆర్థికంగా బరోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు భూగర్భవ-నరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతమైనందుకు శుక్రవారం ఉదయం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత వ్యవహారిక భాష ఉద్యమ పితామహులు గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి రాష్ట్ర మంత్రివర్యులు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాష అభివృద్ధికి చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం మంత్రివర్యులు మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆడబిడ్డల్లో చైతన్యం తెచ్చి, మహిళలకు పద్మావతి విశ్వవిద్యాలయం నెలకొల్పి, రిజర్వేషన్లు, ఆస్తి హక్కును కల్పించిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి అన్న నందమూరి తారక రామారావుకే దక్కుతుందన్నారు. ఆడబిడ్డలను మరింత ముందుకు తీసుకుపోయిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కే దక్కుతుందన్నారు. డ్వాక్రా సంఘాలను పెట్టడం, సాఫ్ట్వేర్ రంగంలో మహిళలకు ప్రోత్సహించి విదేశాలకు పంపడం, ఆడబిడ్డలు ఇబ్బంది పడకుండా దీపం పథకం కింద సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ ల సరఫరా, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ 15 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు., తల్లికి వందనం పథకం కింద రాష్ట్రంలో 68 లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతున్నారన్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద రాష్ట్రంలో ఉన్న బస్సులలో 74% బస్సులను కేటాయించారని, చిన్న చిన్న పనులు చేసుకునే మహిళలు 1500 నుంచి 2000 రూపాయల నెలవారీ ఖర్చులు ఆదా కావాలని, ఆ డబ్బులు వేరే విధంగా ఉపయోగించుకోవాలని, డ్వాక్రా సంఘాల ద్వారా వచ్చిన డబ్బుతో ఎం ఎస్ ఎం ఈ చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం పట్ల మహిళల్లో అద్భుతమైన స్పందన ఉందన్నారు. రాబోయే రోజుల్లో మహిళలను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టబోతోందని వాటన్నిటిని మహిళలు అందిపుచ్చుకోవాలన్నారు.. యోగాంధ్ర కార్యక్రమంతో ప్రపంచ రికార్డు సృష్టించామని ప్రతి ఒక్క ఇంటిలో అందరూ యోగా సాధన చేసి ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ ఆశయమన్నారు గతంలో మచిలీపట్నం విజయవాడకు 4 వరుసల జాతీయ రహదారిని నిర్మించేందుకు కృషి చేశామన్నారు. అలాగే నేడు మచిలీపట్నం విజయవాడకు 6 వరుసల జాతీయ రహదారి నిర్మించేందుకు కేంద్రమంత్రి నితిన్ ఘట్కరితో మాట్లాడామని, 2600 కోట్ల రూపాయల వ్యయంతో ఆ రహదారి మంజూరు చేయడం జరిగిందన్నారు. మచిలీపట్నం నుండి రేపల్లె వరకు 45 కిలోమీటర్ల రైల్వే లైన్ పొడిగింపు కార్యరూపం దాల్చిందని, ఇందుకోసం 3 నెలల క్రితం కేంద్ర మంత్రితో మాట్లాడామని అన్ని ప్రయత్నాలు చేశామని 2 సంవత్సరాలలో పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ రైల్వే లైన్ కోసం పోరాటం చేసిన బందరు నివాసి కొక్కిలిగడ్డ కోదండరామయ్య నేడు చనిపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం స్త్రీ శక్తి పథకం విజయవంతం అయిందన్నారు రాష్ట్రంలో 10,500 బస్సులు ఉండగా అందులో 75% 8,500 బస్సులను మహిళల కోసం ఉచిత బస్సు పథకానికి కేటాయించామన్నారు తాము అనుకున్న అంచనాలు మించిపోయాయని, రోజుకు ఆర్టీసీకి 5 కోట్ల రూపాయల నష్టం వస్తుందని అంచనా వేశామని, అయితే 7.5 కోట్ల రూపాయల నష్టం వస్తుందన్నారు. ఇప్పటివరకు 2 కోట్ల 40 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని వినియోగించుకున్నారన్నారు. గతంలో బస్సులలో మహిళలు పెద్దగా లేకుండా వెలవెలబోయే వన్నారు. ప్రయాణించేది తక్కువగా ఉండేదని నేడు మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తుండడంతో మహిళలు అధికంగా ప్రయాణం చేస్తున్నారన్నారు ప్రస్తుతం ఉన్న బస్సులు చాలక పోవడంతో మరో 1,380 కొత్త బస్సులను సరఫరా చేయాలని ఉత్తర్వులు ఇచ్చామన్నారు దశలవారీగా బస్సులు పెంచే ఏర్పాటు చేస్తామన్నారు బస్సుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా బందరువాసి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు జీ ధనలక్ష్మిని మంత్రి , ఆర్టీసీ ఛైర్మన్ ఘనంగా శాలువతో ఘనంగా సత్కరించారు. తదనంతరం మహిళా లబ్ధిదారులకు మంత్రివర్యులు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మహిళలతో కలిసి మంత్రివర్యులు, ఆర్టీసీ ఛైర్మన్ గ్రూప్ ఫోటో దిగారు. తదుపరి మంత్రివర్యులు మహిళలకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, ఆర్టిసి ఆర్ఎం వెంకటేశ్వర్లు, డిఎం పెద్దిరాజు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు అనిత, సమతాకీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్లు గొర్రెపాటి గోపీచంద్, రొండి కృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ వైస్ ఛైర్మన్ కాశీ విశ్వనాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీఛైర్మన్ గోపు సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు విద్యాసాగర్, స్థానిక నాయకులు ఫణి కుమార్ పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యసంరక్షణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించండి - లంకిశెట్టి బాలాజీ డిమాండ్



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నం అర్బన్ మరియు రూరల్ ప్రాంతాలలో ప్రతి ఇంటిలోనూ వైరల్ జ్వరాలతో, దగ్గు, జలుబులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని వారి ఆరోగ్య పరిరక్షణ కోసం మచిలీపట్నం కార్పొరేషన్ కు ప్రత్యేక నిధులు కేటాయించాలని జిల్లా కలెక్టర్ కు మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా మచిలీపట్నం కార్పొరేషన్ కు హెల్త్ ఆఫీసర్ ను నియమించకపోవడం దురదృష్టకర మని అన్నారు. గతంలో వలే మచిలీపట్నంలో వీధులు లలో బ్లీచింగ్, డ్రైనేజీల్లో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్, వాటర్ ట్యాంకులలో నీటి పరిశుద్ధత కోసం చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని బాలాజీ అన్నారు. మచిలీపట్నంలో పారిశుద్ధ్య సమ-స్య వల్ల అనారోగ్యాలు రోగుల సంఖ్య పెరుగుతుందని బాలాజీ అన్నారు. ప్రజలను అప్రమత్తం చేసే విధంగా కరపత్రాలు ముదిరించి పంపిణీ చేయాలని బాలాజీ సూచించారు. మచిలీపట్నంలో ప్రభుత్వ ఆసుపత్రులు ప్రైవేటు ఆసుపత్రులు గాని రోగులతో కిటకిటలాడిపోతున్నాయని ప్రభుత్వాసుపత్రులను ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని బాలాజీ అన్నారు. వైరల్ ఫీవర్లు పేరుతో ల్యాబ్ టెస్టులు పేరుతో వేలాది రూపాయలు నగర ప్రజలపై భారం పడుతుందని బాలాజీ తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో తనిఖీలు ఏర్పాటు చేసి ఇంటింటికి మందులు పంపిణీ చేయాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని బాలాజీ కోరారు. ఏ విధమైన చర్యలు తీసుకోకపోతే హెల్త్ ఎమర్జెన్సీ పెట్టవలసిన రోజు దగ్గర్లోనే ఉంటుందని బాలాజీ తెలియజేశారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**మచిలీపట్నం, కలంకౌంటర్ :** వ్యవహారిక తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవహారిక తెలుగు భాషకు కృషిచేసిన గిడుగు రామమూర్తి ఆశయ సాధనకు మనమందరం కృషి చేయాలని అన్నారు. మన భావాలను వ్యక్తీకరించడానికి తెలుగు అనుకూలమన్నారు. ఇతర భాషలను అభ్యసించినా తెలుగును విస్మరించరాదని అన్నారు. తెలుగు భాష మాధుర్యాన్ని ఔన్నత్యాన్ని వివరించారు. అనంతరం వేములపల్లి రవికుమార్, సాహితీవేత్తలు డా. చింతలపాటి మురళీకృష్ణ, డా. పన్యారం సాంబ శివరావు, మేరీ కృపాబాయి, మడమల రాంబాబులను ఘనంగా సత్కరించారు. భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ,డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, బి విజయ్ కుమార్, ఐవివి రామారావు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com